www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 18 | జూలై | 2024 పేజీలు 7

## తాలిపేరుకు జలకళ

- నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు



2లో

# నేటి నుంచి రుణమాఫీ..!

-గ్రామాలకు చేరిన అర్హుల జాబితా -రైతుల మోములో దరహాసం





**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ఎన్నికల హామీలలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ కి మార్గదర్శకాలు విడుదల చేసింది. స్వల్ప కాలిక పంట రుణాల్లో కుటుంబానికి రూ. 2 లక్షలు మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతుంది. వ్యవసాయ శాఖ ద్వారా ఎంత మంది రైతులకు పంట రుణాలు ఉన్నాయి. వాటిలో రూ.2 లక్షల లోపు ఉన్న వారు . అంత కంటే ఎక్కువ మంది ఉన్నవారు ఎందరున్నారో ప్రాధమిక సమాచారం ను బ్యాంకర్ల ద్వారా వ్యవసాయ శాఖ సేకరించింది. దీని ఆధారంగా ప్రభుత్వం అర్హుల ను గుర్తించింది. జిల్లాలో అధికార యంత్రాంగం కసరత్తు చేసింది. అర్హుల జాబితా బ్యాంకుల వారీగా రుణమాఫీ జాబితా గ్రామాలలో సోషల్ మీడియా వైరల్ అవుతున్నాయి. భూమి కలిగిన ప్రతీ రైతు కుటుంబానికి రూ.2 లక్షలు వరకు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిల మాఫీ వర్తిస్తుంది.

**గత ప్రభుత్వం కొత్త కార్డులే ఇవ్వలేదు...**

రుణమాఫీ కి తెల్ల రేషన్‌కార్డు ప్రమాణికంగా తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇదే పలువురు రైతులలో ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడ్డక పలువురు సన్న కారు రైతులు

మిగతా 2లో..

## పార్టీ, ప్రజా సంఘాల విస్తరణకు
# కృషి చేయాలి



- ప్రజల మౌలిక అవసరాలు తీర్చేవరకు విశ్రమించేది లేదు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- సిపిఐలో చేరిన వంద కుటుంబాలు

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సేవలందించండం ద్వారా నియోజకవర్గంలో పార్టీతో పాటు ప్రజా సంఘాలని విస్తరింపజేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాతకొత్తగూడెంలో బుధవారం జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యాతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కూనంనేని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా సమక్ష్యంలో 100 కుటుంబాలకు చెందిన

మిగతా 2లో..

## 28 నుంచి పిఎల్‌జిఏ
# మావోయిస్టు వారోత్సవాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** దండకారణ్యం నివురుగప్పిన నిప్పులా ఉంది. జూలై 28 నుండి ఆగస్టు 3వ తేది వరకు పిఎల్‌జిఏ వారోత్సవాలను నిర్వహించేందుకు మావోయిస్టు పార్టీ సిద్ధమవుతోంది. పట్టున్న ప్రాంతాల్లో అమర వీరులను స్మరిస్తూ సభలు, సమావేశాలు, ఆటా పాట నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ జనవరి నుండి ఛత్తీస్‌గఢ్

మిగతా 2లో..

- ఇప్పటికే సెంట్రల్ కమిటీ పేరిట కరపత్రాలు విడుదల
- నివురుగప్పిన నిప్పులా దండకారణ్యం
- ఏజెన్సీలో హై అలెర్ట్
- వారోత్సవాల వీడియోలు బహిర్గతం

# గుట్టుగా గుట్కా దందా..!



-నిషేధం ఉన్నా యథేచ్ఛగా అమ్మకాలు
-వివిధ మార్గాల్లో అక్రమ రవాణా
-జోరుగా గ్రామాల్లోకి తరలింపు

**ప్రజాపక్షం/పినపాకః** మండలంలో గుట్కా దందా గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పల్లెల్లో నుంచి ఎక్కడపడితే అక్కడ జోరుగా వ్యాపారం సాగుతుంది. టాస్క్‌ఫోర్స్ దాడులు కొనసాగుతున్నా.. అమ్మకాలు మాత్రం ఆగడం లేదు. దీంతో దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడుపుతున్న గుట్కా మాఫియా ఈ వ్యాపారాన్ని వదులుకోవడానికి ఏ మాత్రం ఇష్టపడటం లేదు. పైగా నిషేధిత గుట్కా వ్యాపారాన్ని మరింత సీరియస్‌గా తీసుకొని లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. నిన్నటి, మొన్నటి వరకు పాన్ డబ్బాలలో గుట్కా ప్యాకెట్లు విక్రయించాలంటే వెనకముందాడిన వ్యక్తులు నేడు భయం లేకుండా గుట్కా విక్రయాలు సాగిస్తున్నారు. ఇళ్లనే గోదాములుగా ఎంచుకుని గుట్కా మాఫియా చెలరేగిపోతోంది. పాన్ షాపులు, కిరాణ

మిగతా 2లో..

# నేటి నుంచి రుణమాఫీ..!

(మొదటిపేజీ తరువాయి)

పట్టాదారు పాస్ పుస్తకాలు పొందారు. అయితే గత ప్రభుత్వం అసలు కొత్త రేషన్ కార్డులే ఇవ్వలేదు. చాలా మందికి తల్లిదండ్రులతో పాటు కలిసి ఉన్న రేషన్ కార్డులే ఉన్నాయి. మరి కొందరు వివాహం చేసుకు న్నాక రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పటి వరకు రాలేదు. రుణమాఫీ కి ప్రభుత్వం అడుగులు వేయటంతో తమను అర్హు లుగా గుర్తిస్తారా లేదా అని వీరిలో ఉత్కంఠ నెలకొంది.

**నేడు గ్రామ, గ్రామాన సంబురాలు.....**

తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి గురువారం రూ.1 లక్ష లోపు వారికి ఇవ్వటంతో సదరు రైతులు జిల్లా వ్యాప్తంగా సంబురాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఏర్పాట్లు చేపట్టారు. ఇది ఇలా ఉండగా...తెలంగాణ సీఎం రేవం త్‌రెడ్డి సాయంత్రం నాలుగు గంటలకు వీడియో కాన్ఫరెన్స్ లో ప్రసం గించనున్నారు. ఇందుకు రైతులు ఆయా రైతు వేదికల వద్ద కు రావాలని అధికారులు రైతులను సమీకరిస్తున్నారు. ఉమ్మ డి జిల్లా వ్యాప్తంగా 5,58,191మంది రైతులు, ఖమ్మం జిల్లాలో 26 బ్యాంకులలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 22 బ్యాంకులలో రైతులు రుణాలు తీసుకున్న కోట్ల రూపాయలను మూడు విడతలు గా రుణ మాఫీ చేయనున్నారు. దీంతో రైతులలో సంతోషం వ్యక్తమవుతుంది. కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో పాలాభిషేకాలు చేయ నున్నారు.



**చాలా సంతోషంగా ఉంది : ఆనం వెంకటరెడ్డి, రైతు,అనంతనగర్.**

తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల రుణ మాఫీ చేయటం చాలా సంతో షంగా ఉంది. రైతుకు వ్యవసాయం పండగ అంటే ఇదే నిజంగా ప్రస్తుత పరిస్థితులలో రుణమాఫీ రైతులకు వరం లాంటిది. ప్రభుత్వం కు రుణ పడి ఉంటాం.

**ఎక్కువ మంది రైతులకు వచ్చే విధంగా చూడాలి : పొగర్తి సుధాకర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, నేలకొండపల్లి**



ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ వచ్చేలా చర్యలు తీసుకోవాలి. మార్గదర్శ కాలు మరోసారి సమీక్షించి ఇంకా ఎక్కువ మంది రైతులకు మాఫీ వర్తించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి.

**చాలా మంచి నిర్ణయం : బచ్చలకూరి నాగరాజు, యువ రైతు, కోరట్లగూడెం.**



కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేయటం చాలా మంచి నిర్ణయం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల మొహంలో సంతోషం ఉంది. గత పాల కులు వ్యాపారులు,కాంట్రాక్టర్లు తప్ప ఎవ రికి ప్రయోజనం చేకూరలేదు. రైతు పక్ష పాతి ప్రభుత్వం. ప్రభుత్వం కు రైతుల మద్ధతు ఉంటుంది.

### 28 నుంచి పిఎల్‌జిఏ

# మావోయిస్టు వారోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

దండకారణ్యంలో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. గాయాలు మానకుండానే వారోత్సవాలు నిర్వహించి తమ సత్తా చాటా లనే ఉద్దేశ్యంతో మావోయిస్టు పార్టీ ఇప్పటికే పలు ప్రాంతాల్లోకరపత్రా లు విడిచినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా విప్లవపంథాను పునికిపు చ్చుకుని అమరులైన మావోయిస్టులకు నివాళులు అర్పించనున్నారు. ఈ వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకోవాడం ఆనవాయితీగా వస్తోంది. జూలై 28,1972న నక్సల్‌బరీ వ్యవస్థాపకుడు చారుమజుందార్ మరణించారు. అలాగే 1982 జూలై 18న మరో విప్లవ నాయకుడు కన్యాయ్ ఛటర్జీ చనిపోయారు. వీరిద్దరిని స్మరిస్తూ ప్రతి ఏటా జూలై 28 నుండి వారోత్సవాలు మావోయిస్టు పార్టీ నిర్వహిస్తుంటోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా సుమారు 200 మందికి పైగా విప్లవకారులు మరణించారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లోనే సుమారు 106 మందికి పైగా మృతిచెందారు. విరందరినీ స్మరించేందు కు సమాయత్తం అవుతున్నారు. కమ్యూనిస్టు సాయుధ పోరాటంలో ఈ వారోత్సవాలు అత్యంత ప్రధానంగా నిర్వహిస్తుంటారు. హై అలెర్ట్ పిఎ ల్‌జిఏ వారోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మావోయిస్టుల ఇలా కాలో కూంబింగ్ ఆపరేషన్లు ముమ్మరం చేశారు. మావోయిస్టులు ఛత్తీస్ గఢ్ దండకారణ్యంలో క్రాంతికారి జనతన్ సర్కార్ పేరిట సమాంతర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంగతి విధితమే. కాగా ఆ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి మావోయిస్టుల ఏరివేత మరింత ఊపందుకుంది. షరతులతో కూడిన చర్చలకు తాము సిద్ధమంటూ మావోయిస్టు పార్టీ ప్రభుత్వానికి కబురుపెట్టినా పెడచెవిన పెట్టిందని వా రు వాదిస్తున్నారు. ఆపరేషన్ ప్రహార్ పేరిట దండకారణ్యంలో అణువ నునా గాలింపు చర్యలు సాగుతున్నాయి. ఇప్పటికే 106 మంది సా యుధ నక్సలైట్లు మరణించారు. మావోయిస్టు స్వరంగ మార్గాలను కని పెట్టి ధ్వంసం చేశారు. అత్యంత కట్టుదిట్టమైన రహస్య స్థావరాలను సైతం కనిపెడుతున్న భద్రతా బలగాలు చుట్టుముట్టి మట్టుపెడుతున్నాయి. ఈ వారోత్సవాలను కేంద్రంగా చేసుకుని మావోయిస్టు పార్టీ ప్రతిదాడులకు పాల్పడే అవకాశాలున్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నాయి. దీంతో సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్రా పోలీ సుల సమన్వయంతో అడవుల్లో ముమ్మర గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మావోయిస్టుల సమాచారం తెలిస్తే చెప్పాలంటూ గ్రామాల్లో పోలీసులు ప్రచారం నిర్వహిస్తూ దోమ తెరలు పంపిణీ చేస్తున్నారు. దీం తో హై అలెర్ట్ నెలకొంది. ఆయా రాష్ట్రాల ఆపరేషన్ బలగాలతో పాటు కేంద్ర పారామిలటరీ బలగాలు రంగంలోనికి దిగాయి. ఆగస్టు 3వరకు సాగే వారోత్సవాలు ముగిసే వరకు అటవీ గ్రామాలను జల్లెడ పడుతు న్నారు. వారోత్సవాల సందర్భంగా కేవలం సంస్మరణ సభలు నిర్వహిం చుకోవడమే కాకుండా ప్రత్యర్థులను, ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడే అవకాశాలు ఉన్నందున ఆయా రాష్ట్రాల పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. బహిర్గతం మావోయిస్టు ఈ మధ్య కాలంలో వారు నిర్వహించే అనేక కార్యక్రమాలను వీడియోల రూపంలో బహిర్గతం చేస్తున్నారు. దట్టమైన దండకారణ్యంలో వారోత్స వాలు నిర్వహించే సమయంలో వీడియోలు తీసి సోషల్ మీడియా వేది కగా బాహ్య ప్రపంచానికి విడుదల చేస్తున్నారు. ఆయా గిరిజన గ్రామాల్లో ప్రజానికాన్ని ఏకం చేసి సంస్మరణ సభలు నిర్వహించి, కళా రూపాలు ప్రదర్శిస్తున్నారు. స్థూపాలు నిర్మించి అమరులకు నివాళులు అర్పిస్తున్నారు. మహిళా దినోత్సవాలను నిర్వహిస్తూ వాటికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు.

# తాలిపేరుకు జలకళ

ప్రజాపక్షం/భద్రాచలం : చర్ల మండల పరిధిలోని తాలిపేరుకు జలకళ సంతరించుకుంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని భారీ వర్షాలు కురుస్తుండటంతో అడవుల ద్వారా నీరు కొట్టుకొచ్చి తాలిపేరులో కలుస్తోంది. దీంతో నాలుగు గేట్లు పూర్తిగా, 21 గేట్లు రెండు అడుగుల మేరా ఎత్తి 68 వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరి నదిలోనికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోనికి మరింత నీరు వచ్చి చేరే అవకాశం ఉండటంతో కుడి, ఎడుమ కాలువల రైతులతో పాటు దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టును సందర్శించి నీటి విడుదలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

## పార్టీ, ప్రజా సంఘాల విస్తరణకు కృషి చేయాలి



(మొదటిపేజీ తరువాయి)

వారు పార్టీలో చేరారు. వీరికి ఎర్రకుండువాలు కప్పిన నేతలు సిపిఐలోనికి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రతి పల్లెకు, బస్తీకి కావాల్సిన రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి కనీస మౌలిక వసతులు కల్పించే వరకు విశ్రమించేది లేదన్నారు. గడిచిన ఏడు మాసాల కాలంలో నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయలతో అభి వృద్ది పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వీటిలో కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరికొన్ని పూర్తయ్యాయన్నారు. మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. చల్ల వెంకటేశ్వర్లు, మంగ, వెంకటమ్మ, హుస్సేన్, బార్ల సంజీవరావు, పుల్ల య్య నేతృత్వంలో వంద మంది సిపిఐలో చేరిన వారిలో ఉన్నారని, పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ప్రజా సంఘాల బాధ్యతలు తీసుకుని ప్రజా సేవలో నిమగ్నం కావాలన్నారు. నిమ్మ గడ్డ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, యాసఫ్,విజయ్, చారి, దుర్గ, ధర్మరాజు, నర్సింహా, నాయకులు వాసిరెడ్డి మురళీ, లగడపాటి రమేష్ చంద్ర, రత్నకుమారి, కిలారు ప్రసాద్, ధనలక్ష్మి , భాగ్యలక్ష్మి న్నారు.

# గుట్టుగా గుట్కా దందా..!

(మొదటిపేజీ తరువాయి)

షాపుల్లో గుట్కా, అంబర్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఏ గ్రామాల్లో చూసినా ఇవే దర్శ నమిస్తున్నాయి. ఉదయం లేచిన దగ్గర నుంచి ఏ షాపు ముందు చూసిన గుట్కా ప్యాకెట్లను వేలా డదీసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో కోట్ల రూపాయల వ్యాపారం చాపకింద నీరులా సాగిపోతోంది. విమల్, పాన్‌పరాగ్, ఎంసీ, చైనీ ఖైనీ ఇలా పలు రకాల కంపెనీల పేర్లతో జోరుగా వ్యాపారం సాగుతున్నాయి. ఆరోగ్యానికి తూట్లు పొడిచే గుట్కాను ప్రభుత్వం నిషేధించినా లాభా ర్జనే ధ్యేయంగా అక్రమార్కులు యథేచ్చగా దాన్ని విక్రయిస్తూ యువతను మత్తులో ముంచెత్తుతు న్నారు. మార్కెట్‌లో గుట్కా ప్రియులు ఎక్కువగా ఉండటంతో గుట్కాలకు భారీగా డిమాండ్ పెర గుతుంది. గుట్కాను ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా విక్రయిస్తున్నారు. 5 రూపాయలకు దొరికే ప్యాకెట్లను ఇప్పు డు15 నుంచి రూ. 20 దాకా అమ్ముతున్నారు. మరో వైపు గుట్కా జోలికెళితే గుటుక్కు మనేది ఖాయమని వైద్యులు హెచ్చరిస్తున్నా గుట్కా ప్రియులు వారికోసం పరితపిస్తున్నారు. గుట్కా వ్యాపారులపై పోలీసులు దాడులు చేసినప్పుడే అక్కడక్కడ చిరువ్యాపారులు జాగ్రత్తలు తీసుకుం టున్నారు. ఆ తదుపరి కొద్దిరోజులకు పరిస్థితులు మళ్లీ మామూలుగా మారుతున్నాయి. గుట్కా దందాను అరికట్టడంలో భాగంగా పోలీసులు జరుపుతున్న దాడుల్లో మాములు వ్యాపారులే పట్టుబడుతున్నారని అసలు వ్యాపారులు చిక్కడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అస లు గుట్కా వ్యాపారుల జాడలు అధికారులు తెలుసుకొని, వారిని పట్టుకుంటే బాగుంటుందన్న పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా అమ్ముతున్న వ్యాపారాలపై చర్యలు తీసు కోవాలని, యువత గుట్కా బారిన పడకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జేఏసి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : నూతన నేర చట్టాలపై అడ్వ కేట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సును స్థానిక శ్రీశ్రీ హోటల్‌లో నిర్వహిం చారు. ఈ సదస్సుకు ప్రధాన వక్తగా హాజరైన సీనియర్ న్యాయవాది చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మామిడి హన్మంతరావు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేరళ్ల శ్రీనివాసరావు, హై కోర్టు న్యాయవాది ఈశ్వర ప్రగడ హరిబాబు తదితరులు న్యాయవాదులకు నూతన చట్టాలపై వివరించారు. ఈ సదస్సులో పెద్ద సంఖ్యలో సీని యర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## ఖమ్మం డిపో మేనేజర్‌ను కలిసిన ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాపక్షం/ ఖమ్మం : టిజిఎస్ ఆర్టీసీ ఖమ్మం డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.దినేష్‌కుమార్ ను ఆర్టీసీ ఎంప్లాయీస్ నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డిపో నిర్వహణలో ఉన్నత స్థితికి చేరి ఖమ్మం డిపోను అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. డిపో మేనేజ ర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఖమ్మం రీజి యన్ కార్యదర్శి పిల్లి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధీర్ గాంధీ, డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు, సభ్యులు ఎం. వెంకటేశ్వర్లు, జి. వెంకటేశ్వర్లు, రామకృష్ణ, పెంటయ్య, అనిత, జ్యోతి, ఆదిలక్ష్మి , రజని, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



# డిఎస్సి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్163 అమలు



### ఖమ్మం నగర పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం కమిషనరేట్ పరిధిలో జులై 18 నుంచి ఆగష్టు ఐదు వరకు జరిగే డియస్సి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ చట్టం 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని ఆరు పరీక్షా కేంద్రాలలో జులై 18వ తేదీ నుండి ప్రతి రోజు రెండు సెషన్లలో ఉదయం తొమ్మిది నుండి 12 మధ్యాహ్నం, రెండు నుండి ఐదు గంటల వరకు కమిషనరేట్ పరిధిలో నిర్వహించే పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సెక్షన్ 163 ఆంక్షలు అమలులో ఉంటాయని, పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజెలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సిపి తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు సంబంధిత నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుతీసుకోవడంజరుగుతుందని తెలిపారు.

# ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటునకు స్థలాల పరిశీలన

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : పాలేరునియోజకవర్గంలో పరిపాలన సౌలభ్యం కోసం ఏసీపీ,రెవిన్యూ, రిజిస్ట్రేషన్‌తో పాటు తదితర కార్యాలయలన్ని ఒకే చోట ఉండేల స్థలం కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పలు స్థలాలను బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఖమ్మం రూరల్ మండలంలోని తరుణిహాట్, శ్రీసిటీ దగ్గర్లోని ప్రభుత్వ స్థలాన్ని, పొన్నెకల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలంలోని మరో స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మంత్రి పొంగులేటి చొరవతో వీటిని ఫైనల్ చేసి పాలేరునియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుతో ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకులాలు అన్ని ఒకే చోట ఉండటంతో కులమత బేధాలు ఉండవన్నారు. అతి తక్కువ ఖర్చులో కార్పొరేట్



స్థాయి నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు వచ్చిన స్వామి నారయణ స్కూల్ యాజమాన్యానికి స్థలాన్ని శ్రీసిటీ దగ్గర్లోని ప్రభుత్వ స్థలాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, శాఖమూరి రమేష్, జొన్నలగడ్డ రవి, కొప్పుల చంద్రశేఖర్, కొడాలి గోవిందరావు, తహశీల్దార్ రాంప్రసాద్, సర్వేయర్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా

# నాయుడు సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



### శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అనుచరుడు నాయుడు సత్యనారాయణ బుధవారం హైదరాబాద్‌లో ఆయన చాంబర్‌లో వేదమంత్రాలతో పదవీ బాధ్యతలు చేపట్టారు. సత్యనారాయణ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పాల్గొని శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైరా పురపాలక సంఘం అధ్యక్షుడు సూతకాని జైపాల్, వైరా, కొణిజర్ల, ఏన్కూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేందర్, వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, రాష్ట్ర కిసాన్ ఖేత్ మజ్దూర్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, కొప్పురావూరి సుమంత్, పమ్మి అశోక్, రాంపూడి రోశయ్య, బొళ్ళ గంగారావు, పల్లపు కొండలు తదితరులు ఉన్నారు.

# బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : బదిలీ అయిన ఎస్‌జిటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) తెలిపారు. బుధవారం పిఆర్‌టియు సంఘం నూతన కార్యాలయంలో పిఆర్‌టియు జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశం జిల్లా అధ్యక్షుల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైవి మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీలలో బదిలీ అయిన ఎస్‌జిటి ఉపాధ్యాయులను నూతన పాఠశాలల్లో జాయిన్ అవుటకు అనుమతించాలని తద్వారా స్టేషన్ సీనియారిటీ కోల్పోకుండా ఉంటారని తెలిపారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వెంటనే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. లెఫ్ట్ ఓవర్ వెకెన్సీస్ ను వెంటనే ప్రమోషన్ ద్వారా నింపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బదిలీ ప్రక్రియలో వెబ్ ఆప్షన్స్ పెట్టుకునేటప్పుడు సమయం తక్కువగా ఉన్నందున కొంత మంది ఉపాధ్యాయులకు తీవ్రంగా నష్టం జరిగిందని వారికి కూడా న్యాయం చేయాలని పిఆర్‌టియు శాఖ తరుపున ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో విద్యా వలంటీర్లను వెంటనే నియమించాలని కోరారు. అనంతరం సంఘానికి సుదీర్ఘ కాలం సేవలు అందించి ఇటీవల రిటైర్ అయిన రమణారావు, రహీముద్దీన్, మోహన్ దాస్‌లను పిఆర్‌టియు జిల్లా శాఖ తరుపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు విజయ్ అమృత్‌కుమార్, శేఖర్, సుజాత, వెంకటనర్సయ్య, సైదయ్య, పాకాల రమేష్, గుడిపూడి శ్రీనివాస్, గుత్తా శ్రీనివాసరావు, హుస్సేన్, వి. నర్సింహారావు, రత్నకుమార్, రమేష్, ప్రభాకర్, కిరణ్, కేశవరావు, బత్తుల వెంకటేశ్వర్లు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## డిఎంగా బాధ్యతలు స్వీకరించిన దినేష్‌కుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం డిపో మేనేజర్‌గా పి. దినేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ రీజినల్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న పి. దినేష్‌కుమార్ పదోన్నతి పై ఖమ్మం డిపో మేనేజర్‌గా బదిలీ పై వచ్చారు. ఖమ్మం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి. దినేష్‌కుమార్‌కు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మొహరం పండుగ



ప్రజాపక్షం/కల్లూరు: మండల పరిధిలోని పలు గ్రామాలలో మొహరం పండుగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి, చెన్నూరు, కల్లూరు, కప్పల బంధం తదితర గ్రామాలలో పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లతో ఊరేగింపుగా పురవీధులలో తిరుగుతూ ప్రత్యేకతను చాటారు. అమరుల స్మరణతో ఊరేగింపు మహమ్మదీయుల ప్రధాన పర్వదినాలలో మొహరం పండుగ ముఖ్యమైనది. హసన్, హుస్సేన్ అనే ముస్లిం వీరుల స్మారకార్థం శోక తప్త హృదయంతో జరుపుకునే పండుగ మొహరం పండుగను గత పది రోజులు నుంచి గ్రామాలలో జరుపుకుంటున్నారు. ఈ పది రోజులలో అమరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాలలో కమిటీ సభ్యులు కోదాన్ జాను, హుస్సేన్ హుసేన్ జాను, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలోని దేవాలయాలు లో బుధవారం తెల్లవారుజాము నుంచే తలస్నానాలు చేసి దేవాలయాలలో విష్ణువు లక్ష్మీ దేవిని పూజిస్తూ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. రోజంతా ఉపవాసం ఉండి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాల ముందు ఉన్న పేదలకు వస్త్ర దానం, దానధర్మాలు చేస్తూభక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి, చిన్నకోరుకొండి, వెన్నవల్లి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, చంద్రు పట్ల, రఘునాధ బంజర, పేరువంచ, బత్తులపల్లి, ముచ్చవరం, బోడిమల్లె, కల్లూరు తదితర గ్రామాలలో ఉన్న దేవాలయాలలో ప్రత్యేక పూజలు పాల్గొని తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలలో అర్చకులు భక్తులు గ్రామాల ప్రముఖులు మహిళా భక్తులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు




ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని కొర్లగూడెం రైతు వేదికలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చే లాంచనంగా ప్రారంభించి లబ్ధిదారులతో ముఖాముఖి దృశ్య శ్రవణంలో మాట్లాడుతారు. దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా రుణమాఫీ రైతుల ఖాతాలకు నేరుగా నగదు జమ చేయడం జరుగుతుందని ఏవో రూపా తెలిపారు. ఈ రుణమాఫీ సంబరాలలో 4407 మంది రైతులకు లక్షలోపు రుణమాఫీ ఖాతాలలో జమ కానున్నది. వారంతా గురువారం రైతువేదికల యందు సంబరాలలో పాల్గొంటున్నారని వ్యవసాయ శాఖ అధికారిని రూపా తెలిపారు. ఈ కార్యక్రమాలలో రైతులతో పాటు ఏఈవోలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు

## ఘనంగా మొహరం వేడుకలు



ప్రజాపక్షం/ఏన్కూరు: మండలవ్యాప్తంగా ముస్లిం సోదరులు మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని గార్లవొడ్డు, బిఆర్.పురం, తూతకలిగన్నపేట, రేపల్లెవాడ తదితర గ్రామాల్లో పీర్లచవిడి కమిటీ వారు గత కొన్ని రోజులుగా మొహరం వేడుకలను వివిధ రూపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అగ్నిగుండం ద్వారా తమ భక్తిని చాటుకొని సాయంత్రం పీర్ల కమిటీ నిర్ణయించిన ప్రదేశాల్లో కర్బలా కార్యక్రమం అలంకరణతో ఊరేగించి కార్యక్రమాలను ముగించారు. ప్రతి సంవత్సరం వచ్చే ఈ మొహరం పండుగను హిందూ, ముస్లిం ఆనవాయితీగా జరుపుకుంటారు. ఈ పండుగలో ప్రజలు తండోపతండాలుగా వచ్చి మొహరం పండుగ ద్వారా దైవాన్ని సందర్శించుకుంటారు. పీర్ల చావిడి కమిటీ సభ్యులు మాట్లాడుతూ వీరుల త్యాగాలకు చిహ్నమని, ప్రేమ, త్యాగం, శాంతి సందేశాన్ని తెలిపేదే మొహరం పండుగ అని తెలిపారు. ప్రపంచ మానవాళికి ఈ మొహరం పండుగ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. త్యాగ గుణాన్ని గౌరవించేందుకు వీరత్వం నుంచి స్ఫూర్తి పొందేందుకు మొహరం పండుగను జరుపుకుంటామని తెలిపారు. పీర్లను ప్రత్యేక అలంకరణతో చేసిన వైనం భక్తులను ఆకట్టుకుంటుందని, చక్కెరతో చదివింపులు చేసి వాటిని భక్తాదులు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. డప్పు వాయిద్యాల నడుమ ఈ పండుగ కన్నులవిందుగా జరిపారు.

## నేడు రైతు రుణమాఫీ దినోత్సవం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రైతు రుణమాఫీ దినోత్సవాన్ని వి. వెంకటాయపాలెం రైతు వేదిక నందు గురువారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష వరకు ఉన్న రైతుల రుణమాఫీని చేయుచున్న సందర్భంగా రైతు రుణమాఫీ దినోత్సవాన్ని రఘునాథ పాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం రైతు వేదిక నందు మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్య మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రైతులంతా ఈ వేడుకల్లో పాల్గొనాలని వారు కోరారు.

## మంత్రులను కలిసిన ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మువ్వా విజయ్‌బాబు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులను మువ్వా విజయ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈనెల 21న ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా మువ్వా విజయ్‌బాబు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లను ఆహ్వానించారు.

## ఆలయాల్లో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/ఏన్కూరు: ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు మండలవ్యాప్తంగా ప్రత్యేకంగా నిర్వహించారు. మండల పరిధిలోని గార్లవొడ్డు, నాచారం, తూతకలిలంగన్నపేట, తిమ్మారావుపేట, బురదరాఘవాపురం, హిమాంనగర్ తదితర గ్రామాల్లో బుధవారం ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాసంలో వచ్చే తొలి ఏకాదశి ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని, రాబోయే పండుగలకు మొదటి పండుగగా జరుపుకుంటారని వేద పండితులు తెలిపారు. ఆలయాల్లో అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. స్వామి వార్లకు విష్ణు శాస్త్ర పారాయణం, అష్టోత్ర పూజా కార్యక్రమం, కలిశ పూజ, పంచామృతాలతో స్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించి కలిశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రజలు ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు ఉదయం నుండే ఆలయాలకు చేరుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగరాజాచార్యులు, వేణుగోపాలచార్యులు, కిరణ్‌కుమార్, ఆచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు రుణమాఫీ ఇవ్వాలి




ప్రజాపక్షం/ అశ్వారావుపేట : తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల వాగ్ధానం ప్రకారం ప్రతి రైతుకు రుణమాఫీ లబ్ధిచేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ నియోజకవర్గ సమితి కన్వీనర్ సయ్యద్ సలీం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మియాజాని భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికభారాన్ని తగ్గించుకునే విధంగా మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. వాటిని సవరించి లక్షలాది మంది రైతులకు అన్యాయం చేయకుండా అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలన్నారు. గత ప్రభుత్వంలో రూ.1లక్ష రుణమాఫీ చేస్తామని రైతులు మోసం చేసిందన్నారు. నిబంధనల పేరుతో రైతులకు అన్యాయం చేయకుండా నిష్పక్షపాతంగా అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ సదుపాయం అందించాలన్నారు. గత ప్రభుత్వ కాలంలో పంటలకు గిట్టుబాటు ధర లేకపోవటం, కరోనా సమయంలో చేతికొచ్చిన పంటలు చేతికి రాకపోవటం తుఫాన్‌ల వల్ల జరిగిన నష్టం లాంటి అనేక సంఘటనలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయ్యారని అన్నారు. కాలయాపన చేయకుండా రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించి రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొహర్రం వేడుకలు



ప్రజాపక్షం/చింతకాని : మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు హిందూ ముస్లింలు బుధవారం చింతకాని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలపరిధిలోని నేరడ ,లచ్చగూడెం,చింతకాని గ్రామాల్లో ముస్లింలతో పాటు హిందువులు మేళ తాళాలతో పీరీల ఊరేగింపు నిర్వహించారు.సావిడి గుండం చుట్టూ హసేన్,హెస్సేన్‌లను స్మరించుకుంటూ తిరిగారు.

# ప్రాణాలు కాపాడండి

-జ్వరంతో బాధపడుతున్న వ్యక్తిని కావిడిపై హాస్పిటల్‌కి తరలింపు
-మానవత్వం చాటుకున్న సిపిఐ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు




ప్రజాపక్షం/బూర్గంపాడు : తరాలు మారిన గిరిజన గ్రామాల తల రాతలు మారడం లేదు. సారపాక మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలో గల శ్రీరాంపురం ఎస్టీ కాలనీ చంద్రయ్య గుంపులో వర్షాకాలం వచ్చిందంటే చాలు అనారోగ్యపాలైన గిరిజన బిడ్డలు ప్రాణాలు వదిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మా ప్రాణాలు కాపాడండి సారు అంటూ ఆ గిరిజన గొంతుకలు ఆవేదన చెందుతున్నాయి. బుధవారం ఆ గ్రామంలో ఓ వ్యక్తి జ్వరంతో బాధపడుతుండగా సరైన రహదారి మార్గం లేకపోవడంతో ఉన్న రహదారి పూర్తి వర్షానికి బురద మయం కావడంతో గ్రామస్తులు కావిడి సహాయంతో కొంత దూరం మోసుకుని, ఆ తర్వాత ట్రాక్టర్ ద్వారా ప్రధాన రహదారికి తీసుకువచ్చారు. అక్కడి నుండి ఆటో ద్వారా హాస్పటల్‌కు తరలించారు. గిరిజన గ్రామాలకు ఇంకా కనీస రహదారి మార్గం సైతం లేకపోవడం, కూత వేటు దూరంలో ఐటిడిఏ ఉన్న మా జీవితాలు మారడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. అయితే గ్రామంలో ఓ వ్యక్తి జ్వరంలో బాధపడుతు ఉన్నారనే విషయం సిపిఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా)కు గ్రామస్తులు తెలపడంతో వెంటనే స్పందించిన ఆయన ఆ వ్యక్తిని ఆ గ్రామం నుండి హాస్పటల్‌కు తరలించేందుకు సహాయ సహకారాలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వస్తే ఈ గిరిజన గ్రామంలోని ప్రజలు ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుందని, ఎన్నో ప్రాణాలు పోయే పరిస్థితులు ఉన్నాయని, కనీసం ఐటిడిఏ పీవో, జిల్లా కలెక్టర్, అధికారులు, నాయకులు ఉన్న చొరవ తీసుకొని ఈ గిరిజన గ్రామానికి సరైన వసతులు కల్పించి, ప్రాణాలకు రక్షించాలని కోరారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో స్థానిక నాయకులు వెంబడి తిరిగి తిరిగి దరఖాస్తులు ఇచ్చి అలిసిపోయామని, ఈ ప్రభుత్వంలోనైనా మా గ్రామానికి రోడ్డు వేసి, సరైన వసతులు కల్పించాలని కోరారు.

# దారిమళ్లుతున్న పిడిఎస్ బియ్యం..!

-ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలే కేంద్రంగా యథాతథంగా కొనుగోళ్లు
-'రూపు'మారి మార్కెట్‌లో తిరిగి ప్రత్యక్షం






ప్రజాపక్షం/బూర్గంపాడు: రేషన్ దుకాణాల ద్వారా లబ్దిదారులకు చేరుతున్న బియ్యాన్ని చిరువర్తకులు, వ్యాపారులు కొనుగోలు చేసి చిన్న మొత్తాలుగా ఉన్న సరుకును వారి నుంచి సబ్ డివిజన్‌లో రేషన్ బియ్యాన్ని గతంలో కంటే మరింత ఉధృతంగా ఆంధ్రాకు చెందిన బడా వ్యాపారులు కొనుగోలు చేసుకుని వెళ్తున్న ఈ వ్యవహారంలో అంతు చిక్కని విధంగా అన్ని వర్గాలకు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి..

### యథేచ్ఛగా బీడీఎస్ బియ్యం కొనుగోళ్లు...

బూర్గంపాడు మండలంలోని ప్రతి గ్రామంలో యద్ధేచ్ఛ బీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా రేషన్ డీలర్లు సైతం లబ్దిదారుల నుంచి రేషన్ దుకాణాల వద్దనే డబ్బులు ఇచ్చి బీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంత మంది మండల పరిధిలోని పలువురు డీలర్ల కన్నుసన్నల్లో గుట్టుగా డీలర్లు ఈ వ్యవహారాలను చక్కదిద్దుతున్నారని పలువురు బహిరంగంగానే తెలుపుతున్నారు.

### డీలర్ల కనుసన్నల్లో గుట్టుగా సాగుతున్న వైనం...

బీడీఎస్ బియ్యం దందా సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..అటు సివిల్ సప్లై విభాగంతో పాటు జంగమంతా తెలిసిందే.. వీరిలో కొందమందికి ఉన్న పలుకుబడితో మంత్రాంగాన్ని అమలుచేస్తూ అధికార యంత్రాంగాన్ని తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎంతలా అంటే రేషన్ దుకాణాల వద్దనే బీడీఎస్ బియ్యాన్ని లబ్దిదారులకు ఇచ్చి నట్టే ఇచ్చి మరల వెంటనే వారికి ఆ బియ్యాన్ని సరిపడా నగదును అందిస్తూ, ఆ బీడీఎస్ బియ్యాన్ని బడా బాబులకు అమ్ముతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్ధరాత్రిళ్ళు నిషి రాత్రిల్లో గుట్టు చప్పుడు కాకుండా బియ్యాన్ని తరలించేందుకు దారులు క్లియర్ చేయడంలో వీరి పాత్ర కీలకమంటే అతిశయోక్తి కాదేమో.

### 'రూపు' మారుతున్న బియ్యం...

లబ్దిదారుల నుంచి ప్రత్యేకించి కాలనీలు, పేద వర్గాల వారు, పట్టణాల్లో ఉన్న మధ్యతరగతి వారి నుంచి ఈ బియ్యాన్ని సేకరిస్తున్న చిరు వ్యాపారులు, వీటిని తమకు అనువుగా, అందుబాటులో ఉన్న నాన్ ట్రేడింగ్ మిల్లులకు, పరపతి ఉన్న ట్రేడింగ్ మిల్లుకు బహిరంగంగానే తరలిస్తున్నారు. ప్రధానంగా ఈ బియ్యాన్ని నాన్ ట్రేడింగ్ మిల్లుల్లో పెద్ద నూక, సన్న చీర్ నూక, తౌడులుగా మార్పు చేస్తున్నారు. మరి కొంద బియ్యాన్ని పాలిష్ రూపంలో సన్నరకాలుగా మార్చి క్వాలిటీ బియ్యంగా మార్చి మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. నూకకు, తౌడుకు మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతుండటం, ప్రత్యేకించి వీటిని ఎగుమతి చేసుకునేందుకు వీలుండటంతో వ్యాపారులు తమ అక్రమ దందాను కొనసాగిస్తూ లక్షల్లో కూడపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం కోట్లను ఖర్చు చేసి ఇస్తున్న బియ్యం దళారులు, వ్యాపారులు కోట్లు సంపాదించుకునేందుకు ఉపయోగపడుతున్నాయనడంలో సందేహం లేదు. ప్రభుత్వం నిరుపేదలకు కడుపునిండా తిండిని అందించాలనే ఉన్నత లక్ష్యంతో అమలు చేస్తున్న రేషన్ బియ్యం పంపిణీ ఆ ఆశయానికి తూట్లు పొడిచే విధంగా కొనసాగుతున్నా ఈదందాపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పేరు గొప్ప.. ఊరు దిబ్బ..!

- మధిర మున్సిపాలిటీలో అధ్వాన్నంగా రోడ్లు, పారిశుధ్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు





ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ అంటే పేరు గొప్ప... ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది. వర్షాకాలం వస్తే చాలు మున్సిపాల్టీలో రోడ్లన్ని అధ్వాన్నంగా ఉండటంతో వర్షపు నీరు ఆగి రోడ్లన్ని చెరువుల్లా తలపిస్తుండటంతో పట్టణ ప్రజలు కాలు బయట పెట్టే పరిస్థితి లేదు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఎక్కడా చూసినా గుంతలమయంగా ఉన్న రోడ్లు, సరైన డ్రైనేజి వ్యవస్థ లేక మురికి నీరు నిల్వ ఉండటం, రోడ్ల వెంబడి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి దర్శనమిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా మధిర మున్సిపాల్టీలో ఏదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో మధిర మున్సిపాల్టీలో అపరిశుభ్రమైన వాతావరణం వలన సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మధిర మండలంలో డెంగ్యూ జ్వరాలతో ప్రజలు అనేక అవస్థలు పడుతన్నారు. అయినా మున్సిపాల్టీ పాలకులు కాని, ప్రజాప్రతినిధులు కాని పట్టించుకోవటం లేదు. ఇదిలా ఉంటే కేవలం వాటాప్స్‌ల్లో, సోషల్‌మీడియాల్లో వచ్చే సమస్యలను మాత్రం పరిష్కరిస్తూ వార్డుల్లో పలు సమస్యలు ఉన్నాయని తెలిసినా మున్సిపాల్టీ పాలకవర్గం కాని, సిబ్బందికాని చూసి చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చినుకు పడితే చాలు రోడ్లన్ని చిత్తడై సరైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో వరదనీరు రోడ్లపై నిలిచి పాదచారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. మధిరలోని రైల్వేస్టేషన్ రెండో ప్లాట్ఫారం, మార్కెట్ యార్డ్ రోడ్డు, లడక బజార్, మడుపల్లి ఐదవ వార్డు, ముస్లింకాలనీ ఎలా చెప్పుకుంటూ పోతే అన్ని వార్డుల్లో ఇదే సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మధిర మున్సిపాల్టీలో ముఖ్యంగా గతంలో వేసిన సిమెంట్ రోడ్లు గుంతలుపడి అధ్వాన్నంగా మారినా వాటి స్థానంలో కొత్త రోడ్లు వేయకపోవడం, పట్టణంలో సరైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతోనే వర్షాకాలంలో ఈ దుస్థితి దాపురిస్తుందని మధిర మున్సిపాల్టీ ప్రజలు వాపోతున్నారు. మధిర నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా డిప్యూటీ సిఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క ఇటీవల మధిర మున్సిపాల్టీలో అండర్ డ్రైనేజి నిర్మాణ పనులకు రూ.128కోట్లు మంజూరు చేసినప్పటికీ మధిర మున్సిపాల్టీలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ముఖ్యంగా పలు వార్డుల్లో వీధి దీపాలు వెలగకపోవటం, రోడ్లు గుంతలు పడి అధ్వాన్నంగా ఉండటం, పారిశుద్ధ్య నిర్వహణ లోపం, అస్తవ్యస్తంగా డ్రైనేజి వ్యవస్థ లాంటి పలు సమస్యలపై ప్రజలు అనేక ఇబ్బందలకు గురవుతున్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర మున్సిపాల్టీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి నిధులు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మున్సిపాల్టీ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ఉపాధి డబ్బులు రాకపాయే.. పూట గడవకపాయే..!

-మూడు నెలల నుండి కూలీల ఎదురుచూపు
-జిల్లా అధికారులు స్పందించాలని వేడుకోలు




ప్రజాపక్షం/ఆళ్లపల్లి: నిరుపేద కుటుంబాలు కూలీ డబ్బులు వస్తేనే పూట గడుస్తుంది. అలాంటి నిరుపేద కుటుంబాలకు వేసవిలో ఏ పనులు లేక ఉపాధి పనులకు వెళితే మూడు నెలల కావస్తున్న నేటి వరకు ఉపాధి కూలీ పనులు డబ్బులు రాకపోవడంతో పూట గడవక నిరుపేద కుటుంబాలు బాధపడుతున్నాయి. ఇప్పటికైనా డిఆర్డిఏ జిల్లా అధికారులు దృష్టి సారించి ఉపాధి కూలీ పనులు డబ్బులు చెల్లించాలని నిరుపేద కుటుంబాలు కోరుకుంటున్నారు. మా నిరుపేదల బాధలు అర్థం చేసుకొని జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ఉపాధి కూలీ పనులు డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుకుంటున్నారు. ప్రభుత్వాలు వేసవిలో ఏ పనులు లేక నిరుపేదలు ఖాళీగా ఉంటున్నారని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చారు. పథకం మంచిదే అయిన కిందిస్థాయిలో పథకం నెరవేర్చడంలో విఫలమవుతూనే ఉన్నారు. కింద అధికారులు తప్పో ప్రభుత్వాలు పైసలు వేయడంలో తప్పో కానీ ప్రతి ఏటా ఇదే జరుగుతుంది. పనులు చేసి ఎదురుచూడాల్సిన పరిస్థితి. కొంత మందికి అయితే ఈ కైవైసీ లేకుండా అధికారులు చేయించారు. డబ్బులు రావడం లేదని అడుగుతే వస్తాయి వస్తాయని చివరికి మీకు ఈకేవైసీ లేదని చెప్పారు. ఇలాంటి చిన్న చిన్న తప్పులతో నిరుపేదలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వాలు స్పందించి నిరుపేద ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులని విడుదల చేయాలని, నిరుపేద కుటుంబాలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# బోడ కాకరలో పోషకాలు బోలెడు..!

-వానాకాలంలోనే బోడ కాకర లభ్యం
-కేజీ బోడ కాకర రూ.400లు
-సీజనల్ కూరగాయలు తినాలని సూచిస్తున్న వైద్యులు




ప్రజాపక్షం/వైరా: కొన్ని సీజన్‌లలో కొన్ని రకాలు పండ్లు, కూరగాయలు కాస్తుంటాయి. సీజనల్ పండ్లు, కూరగాయలు ఖచ్చితంగా తినాలని వైద్యులు, పెద్దలు చెబుతుంటారు. ఆరోగ్యానికి ప్రయోజనం చేకూర్చేది బోడకాకరకాయ, వర్షాకాలంలో బోడ కాకరకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ కాకరకాయ రుచితో పాటు మంచి పోషకాలు కూడా అందిస్తుంది. అటవీ ప్రాంతాలతో పాటు పాటు దిగువ ప్రాంత రైతులు బోడకాకరకాయలు అధికంగా పండిస్తున్నారు. బోడకాకరతో పులుసు, వేపుడు కూర, పొడి చేసుకొని భోజన ప్రియులు ఇష్టంగా తింటారు. ఈ బోడకాకరకాయల్లో రుచి మాత్రమే కాదు పోషక విలువలు, ఔషధ గుణాలు ఎన్నో ఉన్నాయి. వానాకాలంలో మాత్రమే దొరికే ఈ బోడకాకరకాయను తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

## ఆళ్లపల్లి నూతన ప్రెస్ క్లబ్ ఏకగ్రీవ ఎన్నిక




ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండల ప్రెస్ క్లబ్ ఎన్నిక బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా బోడకుంట భిక్షం(ప్రజా పక్షం), ప్రధాన కార్యదర్శిగా కోతి చంద్రశేఖర్(నమస్తే తెలంగాణ), గౌరవ అధ్యక్షులుగా కాససబోయిన వెంకటేశ్వర్లు(వార్త), గౌరవ సలహాదారి పరమ ప్రభాకర్(ఆంధ్ర ప్రభ), కార్యదర్శి మండలంజో సదానందచారి(సూర్య), ఉపాధ్యక్షులు బూర్ల సతీష్(జనం సాక్షి), కోశాధికారి బూరుగడ్డ సత్యరాజు(మనతెలంగాణ)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షులు బోడకుంట భిక్షం, ప్రధాన కార్యదర్శి కోతి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ మండలం ఏర్పడిన 8 సంవత్సరాల నుండి ప్రజలకి ప్రభుత్వాలకి మధ్య వారధిగా ప్రజా సమస్యలు అనేకం జరిగిందని, అలాగే వారి సమస్యల పరిష్కారంలో మా వంతు కృషి చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ప్రజా సమస్యలతో పాటు తోటి పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందించే అనేక రాయితీలు వార్తికి వర్తించేలాగా తెలిపారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు గుంతజు నవీన్(ఈనాడు), ఈశ్వరోజు సద్గుణ చారి(ప్రజా జ్యోతి), అంబోజు ప్రవీణ్(నినాదం) పాల్గొన్నారు.

## దీక్ష విజయవంతానికి ప్రకృతిలోకి విత్తనాల విసిరివేత



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఓల్డ్ పెన్షన్ స్కీం, ఎస్జిటీలకు టీచర్ ఎంఎల్‌సి ఎలక్షన్స్‌లో ఓటు హక్కు కోసం 108 రోజుల పాటు తాను చేస్తున్న ఫలహార దీక్ష విజయవంతం అవ్వడానికి ప్రకృతిలోకి(భద్రాచలం పరిసర ప్రాంత అడవిలోకి) విత్తనాలను విసిరి వేయడం జరిగిందని ప్రకృతి ప్రేమికుడు జాకారం హెచ్‌ఎం షేక్ మహమూద్ పాషా తెలిపారు. దీక్ష నేటికీ 17 రోజుకు చేరుతుందని తెలిపారు. దీక్షకు అన్ని వర్గాల నుండి మద్దతు లభిస్తుందని, తద్వారా పాలకవర్గాన్ని చేరి డిమాండ్లను త్వరితగతిన చేర్చుకోవడానికి మార్గం సులభం అవుతుందని ఈసందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వం రజకుల సమస్యలపై స్పందించాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రజకుల సమస్యలపై స్పందించి రజకుల అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రజక సంఘం జిల్లా అధ్యక్షులు చెంచలపు శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల బీసీ రిజర్వేషన్‌పై దృష్టి సారించినందుకు రజక సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రజకుల సమస్యలపై కూడా స్పందించాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు రూ 5లక్షలు ఇవ్వాలన్నారు. జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని, 55 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క రజకులకు పింఛన్ అవకాశం కల్పించాలని, రజకులకు ఇచ్చిన ఇనాం భూములు రజకులకు పట్టాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న భూములు కూడా మళ్లీ రజకులకు చెందే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకొని రజకులకు ఇవ్వాలని, చాలక ఐలమ్మ వర్ధంతి, జయంతి ప్రతి గ్రామ పంచాయితీలో అధికారికంగా నిర్వహించాలని కోరారు.

## ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ దశదినకర్మలో పాల్గొన్న తాటి, పెద్ది

-ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం




ప్రజాపక్షం/ములకలపల్లి: అశ్వారావుపేట ఎస్ఐగా విధులు నిర్వహిస్తు ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ వారి స్వగ్రామం నర్సంపేట మండలం నారక్కపేట గ్రామంలో దశదిన కర్మలకు అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్ రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆర్థిక సాయంగా రూ 25వేలను కుటుంబ సభ్యులకు అందించారు. నివాళులర్పించిన వారిలో ముదిగొండ శ్రీనివాస్, గాదెగోని వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో పట్టు పరిశ్రమ భూములు భద్రమేనా?

-పట్టు పరిశ్రమకు కేటాయించిన భూమి 5.21 కుంటలు
-ప్రస్తుతం ఉన్న పట్టుపరిశ్రమ భూమి ఎంత?
-నల్లమద్ది చెట్లు ఎందుకు నరికివేస్తున్నారు?
-రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంతో భూముల ఆక్రమణలు
-కలెక్టర్ గారు వైరా ప్రభుత్వ భూములను రక్షించండి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి రెవిన్యూలో వైరా రిజర్వాయర్ ఆనకట్ట ప్రక్కన గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టికల్చర్ క్రింద అప్పటి ప్రభుత్వం 5 ఎకరాలు 21 కుంటల భూమిని కేటాయించింది. ఒకప్పుడు వైరా రిజర్వాయర్ ప్రక్కన ఉన్న మల్బరి పెంపకం జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ మల్బరి పెంపకానికి సిబ్బందిని నియమించడంతో పాటు అప్పట్లో భవనాన్ని కూడా ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున మల్బరీ ఉత్పత్తులు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వైరాలో ఉన్న మల్బరీ పెంపకం ఇక్కడ నుంచి తరలిపోయింది. తర్వాత కొన్ని సంవత్సరాలు పట్టు భూములు కాపాడుకోనున్నారు. క్రమేణా పట్టు భవనాలు కాస్త శిధిలావస్థలో పాడై పడిపోయాయి. తర్వాత పట్టు పరిశ్రమ స్థలంలో ఉన్న నల్ల మద్ది చెట్లను ఎవరికి వారే ఇష్టానుసారంగా నరికి వేసి సందర్భాలు లేక పోలేదు. కాని ప్రస్తుతం మల్బరీ తోట క్రింద ఉన్న 5కరాల 21 కుంట భూమి ఉందా?లేక భూమి ఏమైనా ఆక్రమణకు గురైందా? ఇప్పుడు వైరాలో ప్రతిచోట చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వైరా రిజర్వాయర్ ఆనకట్టపై ప్రతిరోజు ఉదయం సాయంత్రం వాకింగ్‌కి వెళుతున్న ప్రజలు పర్యాటక కేంద్రానికి వస్తున్న ప్రజలు గతంలో ఉన్న మల్బరీ తోట గురించి ప్రతినోట చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రస్తుతం తోటకి కేటాయించిన ప్రభుత్వ భూమి ఇప్పుడు ఎంత ఉంది. అప్పనట్లో కేటాయించిన విధంగా 5ఎకరాల21 కుంటల భూమి ఉందా లేదా ఆ భూమి ఆక్రమణకు గురైందా అనేది ఇప్పుడు వైరా మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది. అయ్యా జిల్లా కలెక్టర్ గారు వైరా రిజర్వాయర్ ప్రక్కన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన మల్బరీ పెంపకానికి కేటాయించిన 5 ఎకరాల 21 కుంటలు భూమి ఉందా లేదా అనే దానిపై రెవెన్యూ యంత్రాంగాన్ని దృష్టి సారించేటట్టు చూడగలరు. ఎందుకంటే ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్న రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రస్తుతం రెవిన్యూ అధికారులు వాటి పట్ల పూర్తిస్థాయిలో దృష్టి పెట్టకుండా ఉంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒక పక్క రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములు కాపాడేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రుల ఆదేశాలతో పలు మండలాల్లో రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూములు ఆక్రమణపై ఉక్కుపాదం మోపుతున్నారు. కాని దానికి విరుద్ధంగా వైరాలో ప్రభుత్వ భూములు ఆక్రమణ జరుగుతున్న రిజిస్ట్రేషన్ జరుగుతున్న పట్టించుకునే పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. అందుకే జిల్లా కలెక్టర్ గారు ఒక్కసారి వైరాలో ప్రభుత్వ భూములపై దృష్టి సారించగలరని ప్రజలు కోరుతున్నారు.

## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సమత బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా దేవులపల్లి సమత బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో సమత ఎక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సమత ప్రజాపక్షంతో మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాలను అభివృద్ధి పథంలో ఉండేవిధంగా చూస్తానని విద్యార్థులను విద్యను అభ్యసించే విధానంలో 100%మార్కులు సాధించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలోని మార్కులు సాధించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలోని సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని పాఠశాల అభివృద్ధి కోసం అనుసరించాల్సిన విధానాలను ఖరారు చేస్తామని, స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో పాఠశాల అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. ఇప్పటికే విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలలో చేరడం జరిగిందని, ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తిస్థాయిలో సిబ్బంది విద్యను బోధించడంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. పాఠశాల ఆవరణలో వైద్యసేవలు అందించేందుకు విద్యార్థులకు స్టాఫ్‌నర్స్ నిత్యం అందుబాటులో ఉంటారని, పిల్లల విషయంలో విద్యను అందించడంలో గాని వసతుల విషయంలో గాని ఆహార పదార్థాల విషయంలో గాని గట్టి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## వైరా గ్రంథాలయ చైర్మన్ రేసులో జాలాది



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేసే కార్యక్రమంలో చేపట్టడం జరిగింది. ఈ క్రమంలో వైరాలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న గ్రంధాలయం చైర్మన్ పదవిని కూడా భర్తీ చేయనున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో విద్యావంతుడు అందరితో స్నేహబంధంగా వెలుగుతూ ఎక్కడ ఎలాంటి మచ్చలేకుండా రాజకీయ నాయకుల అందరితో స్నేహపూర్వకంగా ఉంటున్న జాలాది రామకృష్ణ పేరు గ్రంధాలయ చైర్మన్ రేసులో వినిపిస్తుంది. ఇప్పటికైనా మున్సిపాలిటీలో పలువురు నాయకులు జాలాది రామకృష్ణ పేరును ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ గెలుపు కోసం జాలాది రామకృష్ణ ఎంతో కృషి చేశాడు. యువతతో మమేకమై రాందాస్‌నాయక్ గెలుపే ధ్యేయంగా ప్రచారంలో నిర్వహించిన జాలాది రామకృష్ణకు వైరా గ్రంధాలయ చైర్మన్ రేస్‌లో ఉన్నట్లు ప్రధానంగా వినపడుతుంది. ఏది ఏమైనా రామర్రుష్ణకు వైరా గ్రంధాలయ చైర్మన్ పదవి వరిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.

## ఘనంగా తొలిఏకాదశి, మొహర్రం పండుగ



**ప్రజాపక్షం/కొణిజర్ల :** హిందువులకు పవిత్రమైన తొలిఏకాదశిపండుగను మండలంలోని ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ప్రజలు దగ్గరలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పండుగకు ప్రత్యేకమైన పిండివంట పేలప్పిండి దీనిని జొన్నలు వేయించి వాటిని పిండిచేసి దానిలో బెల్లం , పంచదార కలిపిన పేలప్పిండిని ఇష్టంగా తిన్నారు. ముస్లిం సోదరులకు పవిత్రమైన మొహరం పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. పీర్ల దర్గాల వద్ద పీరీలవద ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ ముస్లిం పండుగ ఒకే రోజు రావడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గాలీబ్ పాషా మాట్లాడుతు హిందూ ముస్లిం పండుగలు ఒకే రోజు జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో పాడి పంటలతో చల్లంగా ఉండాలని దేవుని ప్రార్థించినట్లు తెలిపారు. గత 11 రోజులుగా గ్రామంలో మొహరం పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా మొహరం పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారని వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మొహరం కమిటి వారు ఏర్పాట్లు చేశారని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో షేక్ రంజాన్ , షేక్ హుస్సేన్ , షేక్ జాని , షేక్ లాల్ సైదులు , షేక్ మదార్ , షేక్ బాబు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## పీరీలకు జవ్వాజి నాగరాజు చేయూత



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో జరుగుతున్న పీరీల పండుగ సందర్భంగా ఆగ్రామానికి చెందిన కాంగ్రేస్ యువజన నాయకుడు నాగరాజు ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పీరీల సవిడి అభివృద్ధికి అన్ని విధాల స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ కాంగ్రెస్‌కే సాధ్యం

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎన్నికల మేనిఫెస్టో ప్రకారంగా రూ.2లక్షల రుణమాఫి అమలు చేస్తామని ప్రకటించడం జరిగింది. దీనికి అనుగుణంగా గురువారం సాయంత్రం 4గంటలకు రైతుల ఖాతాల్లో లక్ష రూపాయలలోపు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కాంగ్రేస్ అధ్యక్షుడిగా రైతులందరికి హృదయపూర్వక అభినందలు తెలియజేశారు. గత ప్రభుత్వం పది సంవత్సర పరిపాలనలో మూడు దఫాలుగా రూ.99999లు మాఫి చేశారు. అంటే ఒక రూపాయి కలిపితే కొన్ని వందల రైతులకు రుణమాఫి జరిగేది. కాని అలా జరగలేదు. కాంగ్రేస్ ప్రభుత్వం ఆగస్ట్15 నాటికి రూ.2లక్షలు మాఫి చేయనున్నారు. దీనిని అనుకూలించి రేపు లక్ష రూపాయలలోపు మాఫి సాయంత్రం 4గంటలకు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ నెల18వ తేదీన సిఎం రేవంత్‌రెడ్డి 11.50 లక్షల మందికి సంబంధించిన లక్ష లోపు రుణాలు దాదా రూ.6800కోట్లు ఒకేసారి మాఫి చేస్తారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు రైతులతో ఆ సంతోషాన్ని పాల్పంచుకోవాలి. రైతు రుణమాఫిఐ ప్రజల్లోకి కాంగ్రేస్ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, ఐఎన్‌టియుసి, యువత, మహిళలు అందరూ రైతువేదికలో జరుగు రైతు రుణమాఫి వేడుకను విజయవంతం చేయాలని సింగరేణి కాంగ్రేస మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ పేర్కొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఉద్యమించాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ మధిర :** మాదక ద్రవ్యాల నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, యువకులను సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెల్లడించారు. స్థానిక శ్రీరస్తు ఫంక్షన్ హాల్ నందు జిల్లా సిపిఎం ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలని, మాదక ద్రవ్యాల నివారణలో అధికారుల పర్యవేక్షణ కొరవడితోందని, ప్రభుత్వం మాటలు తప్పా చేతలు శూన్యమన్నారు. తెలంగాణ వాస్తవ చరిత్రను ప్రజలు తెలియచేసేందుకు సాయుధ రైతాంగ పోరాట చరిత్రను సాయుధ పోరాట వారసత్వం గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కార్మికులు, రైతాంగ సమస్యలపై సిపిఎం నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటాలు చేయాలన్నారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో పోటీకి సిపిఎం నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని, అధిక స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు గెలుపొందే విధంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, ఎర్ర శ్రీకాంత్, చింతలచెర్వు కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పెషల్ ఆఫీసర్ ఎక్కడ..?



**ప్రజాపక్షం/కారేపల్లి:** రేలకాయలపల్లిలో స్పెషల్ ఆఫీసర్ పరిపాలనలో అస్తవ్యస్థంగా మారిన గ్రామ పంచాయతీ పూర్తిగా విఫలమైన పారిశుద్ధ్యం గ్రామంలో ఎక్కడ చూసిన రోడ్డు మీద నిలిచిన మురికినీరు చెత్తాచెదారం దోమకాటుతో రోగాల బారిన పడుతున్న ప్రజలు అయినా సోయలేని అధికారులు ఇకనైనా పట్టించుకునే వారు ఉన్నారా అని ప్రశ్నిస్తున్న రేలకాయలపల్లి ప్రజలు రాత్రి అయితే చాలు వీధిదీపాలు లేక ఇబ్బందిపడుతున్న ప్రజలు శానిటేషన్‌కు కూడా నోచుకోని గ్రామపంచాయతీ వెంటనే అధికారులు స్పందించి సమస్యను ఇకనైనా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

# సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురండి

**ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రయాణికులకు ప్రయాణ సమయంలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకునే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు. అ కారణంగా బస్సుల సమయ పాలనకు సంబంధించి, ప్రయాణ సమయంలో ప్రయాణికులకు ఎదురయ్యే వివిధ రకాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావడానికి వీలుగా ఉమ్మడి ఖమ్మంజిల్లా డిపోలకు చెందిన అధికారులను సంప్రదించేందుకు ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం డిపో మేనేజర్ 9959225958, మధిర డిపో మేనేజర్ 9959225961, సత్తుపల్లి డిపో మేనేజర్ 9959225962, భద్రాచలం డిపో మేనేజర్ 9959225960, కొత్తగూడెం డిపో మేనేజర్ 9959225959, మణుగూరు డిపో మేనేజర్ 9959225963 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ఆయా బస్టాండ్ల లోని ఎంక్వయిరీ నెంబర్లను కూడా సంప్రదించి సమస్యలను తెలపవచ్చునని ఆర్ఎం తెలిపారు.

# చెక్‌డ్యాం నిర్మాణానికి స్థల పరిశీలన



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** మండలం లోని పైనంపల్లి, రామచంద్రాపురం గ్రామాల మధ్య నూతనంగా నిర్మించనున్న చెక్ డ్యామ్ నిర్మాణంకు అవసరమైన స్థలం ను మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ దయాకర్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆప్రాంత రైతులతో ముచ్చటించారు. చెక్ డ్యామ్ నిర్మాణం ఎక్కడ నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రామచంద్రాపురం లో ప్రస్తుతం ఉన్న చెక్ డ్యామ్ ను రూ. 9 లక్షలతో ఎత్తు పెంచటం, పైనంపల్లి వద్ద రూ.6.50 కోట్ల తో నూతనంగా చెక్‌డ్యామ్ నిర్మించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఇరిగేషన్ డీ.ఈ.ఈ. లు మన్మధరావు, రమేష్‌రెడ్డి, నేలకొండపల్లి ఏఈ టి.రమేష్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, కుక్కల హనుమంతరావు, యడవల్లి సైదులు, పల్లెబోయిన లక్ష్మి నారాయణ, యడవల్లి నాగరాజు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిపోతున్న వీధి కుక్కల బెడద..!

**- గ్రామపంచాయితీ కార్మికునిపై దాడి**
**- నియంత్రణ చర్యలు శూన్యం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలో నానాటికీ వీధి కుక్కల బెడద మరింతగా పెరిగిపోతోంది. వీధుల్లో జనాల కంటే కుక్కలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో వానకు తడుస్తున్న వీధి కుక్కలు బురద నీరు సేవించి ఇష్టాను సారంగా ప్రవరిస్తున్నాయి. వానాకాలం కావడంతో వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం గ్రామ పంచాయితీ సిబ్బంది చెత్తా చెదారాలను తొలగిస్తున్నారు. విధులు నిర్వహిస్తున్న జిపి సిబ్బందిపైకి కుక్కలు ఎగబడుతున్నాయి. బుధవారం ఓ గ్రామపంచాయితీ కార్మికునిపై కుక్క దాడి చేసి పలు చోట్ల కరిసింది. దీంతో ఆ కార్మికుడు లబోదిబోమంటూ మొత్తుకున్నాడు. గమనించిన సిబ్బంది అతనిని వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాలనీల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కులు ప్రజలపై ఎగబడి కరుస్తున్నాయి. పలువురిపై దాడి చేసిన సంఘటనలు సైతం వెలుగులోనికి వస్తున్నాయి. పలువురు జంతు ప్రేమికులు వీధి కుక్కల ఆకలి తీర్చేందుకు ప్రయాసపడుతున్నారు. వారి ఉద్దేశ్యం మంచిదే అయినప్పటికీ వీధిల్లో మనుష్యులపై దాడి చేయడం శోచనీయం. ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి కుక్కల నుండి మనుష్యులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతులు అధిక దిగుబడులు సాధించాలి



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** రైతులు మెళుకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని క్రిస్టాల్ కంపెనీ రీజయనల్ మార్కెటింగ్ హెడ్ నరసింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో క్రిస్టాల్ కంపెనీ అధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రస్తుతం వరి లో రైతులను వేధిస్తున్న కలుపు నివారణ కోసం కొత్తగా వచ్చిన సికోసా ను వాడాలని సూచించారు. కాండం కుళ్లు తెగులు కోరకు మెంటర్ ,దోమపోటు కు కోల్సార్ మందు ను వాడాలని సూచించారు. దీని వలన అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. రైతులకు పలు విషయాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల మార్కెటింగ్ ప్రతినిధి పూర్ణజిత్ పుమిక్స్, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ ప్రశాంత్, రీజినల్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్, రామాంజనేయులు, చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు దీరావత్ రాధాకృష్ణమూర్తి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

# 19న జిల్లా రైతు సంఘం సమావేశం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 19వ తేదిన పాల్వంచలోని చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో జిల్లా రైతు సంఘం ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలపై ఎలాంటి షరత్తులు విధించకుండా ఒకే సారి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తదితరులు హాజరవుతారని చెప్పారు. రైతు సంఘం సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

# ఘనంగా మొహర్రం వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** మొహర్రం పర్వదినం సందర్భంగా తల్లాడలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎస్సై బి.కొండలరావు హాజరయ్యారు. అనంతరం ముస్లిం సోదరులు హోమగుండం చుట్టూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సాంప్రదాయం ప్రకారం నృత్యాలు చేశారు. అనంతరం ఎస్సై కొండలరావును ముస్లిం సోదరులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ నెల 18న వేడుకలు ముగింపు కార్యక్రమంగా భారీగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీర్ల ముజావర్ షేక్.ఈసూబ్, కమిటీ సభ్యులు షేక్. మహారాజ్, బడేమియా, నన్నేసా, బారేల్లి బాబు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

# హస్తకళల చైర్మన్ సత్యనారాయణకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ నాయుడు సత్యనారాయణను తల్లాడ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. వైరాకు చెందిన సత్యనారాయణ బుధవారం హైద్రాబాద్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతేపల్లి భాస్కర్‌రావు, వేమిశెట్టి నాగేశ్వరరావు, ఎంపిటిసి దగ్గుల రఘుపతిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా చైర్మన్‌ను వారు పూలమాలలు, శాలువాలతో సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పదవులు వరిస్తాయని తెలిపారు. తమతో నాయుడు సత్యనారాయణ స్నేహపూర్వకంగా కలిసి ఉండటంతో శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# డిఎస్‌సి పరీక్షా కేంద్రాల వద్ద బిఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమలు



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** నేటి నుండి ఆగస్టు 5వ తేది వరకు జరిగే డిఎస్‌సి పరీక్షా కేంద్రం వద్ద బిఎన్‌ఎస్ఎస్ 163 చట్టం అమల్లో ఉంటుందని డిఎస్‌పి రెహమాన్ తెలిపారు. సుజాతనగర్ మండల పరిధిలోని వేపలగడ్డలో గల అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల్లో పరీక్షా కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతీ రోజు రెండు ఉదయం 9 గం. నుండి మధ్యాహ్నం 1 గం. వరకు, మ.2 గం. నుండి సా.5 గం.వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుమికూడరాదన్నారు. ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించడం నిషేదం అని చెప్పారు. ప్రతీ ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కట్టుదిట్టమనై నిఘా పెట్టామని, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

# విద్యుత్ ఏఈ రామారావుకు సన్మానం



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** విద్యుత్ శాఖ విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ఉత్తమ ఏఈ గా అవార్డు ను అందుకున్నారు. ఎన్‌పీడీసీఎల్ ప్రకటించిన ర్యాంకులలో నేలకొండపల్లి ఏఈ కె.రామారావు జిల్లా స్తాయిలో ఉత్తమ ర్యాంకు ను సాధించారు. మే నెలలో విద్యుత్ సమస్యల పట్ల స్పందించి తక్షణమే పరిష్కరించి, వినియోగదారులతో సఖ్యత పెంచుకున్నారు. మెరుగైన విద్యుత్ సేవలు అందించినందుకు, సమర్ధవంతంగా పని చేసినందుకు సంస్థ జిల్లా స్థాయిలో ఉత్తమ ఏఈ గా ఎంపిక చేసింది. ఈ మేరకు సంస్థ నోడల్ అధికారి నాగప్రసాద్, ఎస్.ఈ. సురేందర్, డీ.ఈ.ఈ చింతమళ్ల నాగేశ్వరరావు లు ఘనంగా సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలో ఏఈ కార్యాలయంలో సంస్థ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పలువురు అభినందనలు తెలిపారు.

# గేట్ వాల్‌లో పడి గేదె మృతి



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ప్రమాదవశాత్తు గేట్ వాల్ లో పడి పాడి గేదె మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం గ్రామానికి చెందిన పాలకుర్తి ముత్తయ్య అనే రైతు కు చెందిన గేదె బుధవారం మేత కోసం గ్రామ శివారు కు వెళ్తుంది. మిషన్ భగీరథ గేట్ వాల్ కోసం తీసిన గుంటలో పడి గేదె మృతి చెందింది. గేట్ వాల్ కు పైన మూత పెట్టకపోవటం వలన ప్రమాదం జరిగింది. దీంతో రైతు కు రూ. 60 వేల విలువైన గేదె మృతి చెందటంతో రైతు అగ్రహం వ్యక్తం చేశారు. రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గేట్ వాల్స్ కు మూతలు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.